క్లుప్తంగా

బుస్సాపురం ఉప సర్పంచ్‌గా బత్తుల విజయలక్ష్మి



పెదకూరపాడు: బుస్సాపురం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా బత్తుల విజయలక్ష్మి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్‌గా ఉన్న దేవెళ్ల సాంబశివరావు వార్డు సభ్యత్వానికి, ఉప సర్పంచ్‌కు రాజీనామా చేయడంతో ఇటీవల గ్రామంలోని 8వ వార్డుకు ఉప ఎన్నికలు జరిగాయి. టీడీపీ అభ్యర్థి బత్తుల శివనాగరాజుపై పది ఓట్ల మెజార్టీతో విజయలక్ష్మి గెలుపొందారు. సోమవారం నిర్వహించిన ఉప సర్పంచ్ ఎన్నికల్లో తొమ్మిది మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా విజయలక్ష్మిని బలపర్చడంతో ఆమె ఎన్నికైనట్లు ఈఓపీఆర్డీ కోయ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా విజయలక్ష్మికి గ్రామ సర్పంచ్ వేముల తిరుపతమ్మ, మాజీ సర్పంచ్ ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ ఎస్.కె.రెహమాన్, శ్రీనివాసరెడ్డి, షేక్ సుభాని అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

బ్రాహ్మణపల్లి ఉప సర్పంచ్‌గా సుభాషిణి ఏకగ్రీవం



రాజుపాలెం: మండలంలోని బ్రాహ్మణపల్లి ఉప సర్పంచ్ పదవికి సోమవారం ఎన్నిక నిర్వహించారు. ఐదో వార్డు మెంబర్ బిట్ర సుభాషిణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఓటింగ్‌కు పది మంది వార్డు సభ్యులకు గాను ఏడుగురు హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా ఎంఈవో మల్లికార్జునశర్మ వ్యవహరించారు. సుభాషిణిని ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి, ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

గుండ్లపల్లి ఉప సర్పంచ్‌గా జూపల్లి మోషే



నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి ఉప సర్పంచ్‌గా జూపల్లి మోషే ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు గ్రేడ్-2 ఎన్నికల అధికారి ఎం.కె.ఎస్ గిరిధర్ సోమవారం తెలిపారు. గ్రామంలో వార్డు సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఇందులో సభ్యుల ఆమోదం మేరకు జూపల్లి మోషే ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. నూతన ఉప సర్పంచ్ మోషేకు పలువురు అభినందనలు తెలిపారు.

జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు స్టీలు ప్లేట్ల బహూకరణ



క్రోసూరు: స్థానిక జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు క్రోసూరుకు చెందిన మారం వెంకట సీతారామయ్య, నాగసరస్వతి దంపతులు వారి కుమారుడు నాగలక్ష్మయ్య జ్ఞాపకార్థం 125 స్టీల్ ప్లేట్లను సోమవారం బహూకరించారు. దాతలకు హెచ్ఎం రామాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖరరెడ్డి, చిలకా సురేష్, బాబూరావు, తులసీ సౌజన్య, జ్యోత్స్న, శ్రీధర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ధరల అదుపులో కేంద్ర ప్రభుత్వం విఫలం: సీపీఎం

ముప్పాళ్ల : కేంద్రంలోని మతోన్మాద మోదీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలు అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ విమర్శించారు. సీపీఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ఆగస్టు 30 నుంచి ఈనెల 4 వరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు మోదీ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల రాయితీలిస్తూ, పేదలపై పన్నులు భారాన్ని మోపుతోందని విమర్శించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్.లక్ష్మీప్రసాద్ అందించారు.

క్రోసూరులో..

స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం క్రోసూరు శాఖ నేతలు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఎం.డీ.జియావుల్ హక్‌కు వినతి పత్రం సమర్పించారు.

అచ్చంపేటలో..

పెరిగిన నిత్యావసర ధరల్ని తగ్గించాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి గంజిమాల రవిబాబు సోమవారం తహసీల్దారు సీహెచ్. పద్మాదేవికి వినతి పత్రం అందజేశారు.

ఇంటింటా పథకాల పండగ

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



నార్నెపాడులో లబ్ధిదారులకు బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

నార్నెపాడు(ముప్పాళ్ల): సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటా పథకాల పండగ జరుగుతోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. మండలంలోని నార్నెపాడులో గడప గడపకు మన ప్రభుత్వం ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పలువుర్ని ఆప్యాయంగా పలకరించారు. నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రభుత్వం పథకాల ద్వారా అందిన సాయం వివరిస్తూ ముద్రించిన పుస్తకాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని తెలిపారు. గత నాలుగేళ్లలో నార్నెపాడు గ్రామానికి రూ.14.54కోట్లు వచ్చాయని పేర్కొన్నారు. కుల మతాలకు అతీతంగా, రాజకీయ పార్టీల తేడా చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అన్నారు.

సంక్షేమ పథకాలకు అందిన నిధులు

రైతు భరోసా ద్వారా 521మందికి రూ.2.55కోట్లు, అమ్మ ఒడి ద్వారా 342 మందికి రూ.1.32కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వారా 161 మందికి రూ.75.37లక్షలు, జగనన్న తోడు ద్వారా 28 మందికి 8.5లక్షలు, వైఎస్సార్ ఆసరా ద్వారా 472 మందికి రూ.86.5లక్షల రుణమాఫీ, డ్వాక్రా సంఘాలకు అందించినట్లు మంత్రి వివరించారు. డ్వాక్రా సున్నా వడ్డీ రుణాల ద్వారా 245 మందికి రూ.7.47లక్షలు, క్రాప్ ఇన్సూరెన్స్ ద్వారా 176 మందికి రూ.12.5లక్షలు, వాహన మిత్ర ద్వారా 13మందికి రూ.3.20లక్షలు, విద్యాదీవెన ద్వారా 156 మందికి రూ.80.17లక్షలు, వసతి దీవెన ద్వారా 132 మందికి రూ18.02లక్షలు, వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా 568 మందికి రూ.4.82కోట్లు సంక్షేమ సాయం అందిందని వెల్లడించారు. అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా 45 మందికి స్థలాలు మంజూరు చేసినట్లు చెప్పారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా ట్రాక్టర్, ఇతర వ్యవసాయ పరికరాలు అందించామని తెలిపారు.

రూ.2.6కోట్లతో అభివృద్ధి పనులు

నాడు–నేడు పథకం మొదటి విడతలో పాఠశాలల అభివృద్ధికి రూ.18.43లక్షలు, నాడు–నేడు రెండో విడతలో రూ. 1.19కోట్లు, 14వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.17లక్షలు, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీలకు శాశ్వత భవనాల నిర్మాణానికి రూ.96.7లక్షలు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, ఎంపీటీసీ సభ్యురాలు మనికె ఏసమ్మ, మాజీ వైస్ ఎంపీపీ ఎం.జె.ఎం.రామలింగారెడ్డి, సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా శ్రీనివాసరావు, శిరిగిరిగోపాలరావు, ఎంపీడీవో పి.పుట్టారెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్. లక్ష్మీప్రసాదు, స్థానిక నాయకులు జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మణిబాబు, గోవిందు శ్రీనివాసరెడ్డి, కనుమూరి సైదారావు, చిన్నపరెడ్డి కృష్ణారెడ్డి, కనుమూరి బాబు, పాలూరి కోటిరెడ్డి, మెపర్తి నరసింహారావు, పాలడుగు అప్పయ్య, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ బాబు చల్లగా ఉండాలయ్యా !

ఫస్ట్ తారీఖు తెల్లారుజామునే ఇంటి ముందుకు వచ్చి పింఛన్ డబ్బులు చేతుల్లో పెడుతున్నారయ్యా...వాటితో నెలంతా నా మందులకి పోను మిగిలిన డబ్బుల్లో నా మనవళ్లు బడికి పోయేటప్పుడు ఒక్కొక్కరికీ రోజు ఐదు రూపాయలు ఇస్తున్నా...నా లాంటి వాళ్ల బాగోగులు పట్టించుకుంటున్న జగన్‌బాబు చల్లగా ఉండాలయ్యా...అంటూ నార్నెపాడు ఎస్సీ కాలనీకి చెందిన గూడపాటి రత్తమ్మ అనే వృద్ధురాలు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును ఆప్యాయంగా ఆలింగనం చేసుకొంటూ తన మనసులోని మాటను చెప్పింది. తమకు వై.ఎస్.రాజశేఖరరెడ్డి అంటే ప్రాణం, ఆయన బిడ్డ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉంటున్నామని తెలిపింది. వచ్చే ఎన్నికల్లోనూ ఆ దేవుడు దయతో మనమే గెలుస్తామంటూ చెప్పడంతో అందరి ముఖాల్లోనూ నవ్వులు వెల్లివిరిశాయి.



నార్నెపాడులో మంత్రి అంబటిరాంబాబును ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న వృద్ధురాలు

తప్పుడు వ్యక్తులకు చంద్రబాబు వత్తాసు


వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న పెదకూరపాడు నియోజకవర్గ నేతలు

పట్నంబజారు: నీచ రాజకీయాలకు నాంది పలుకుతూ.. తప్పుడు వ్యక్తులకు చంద్రబాబు వత్తాసు పలకటం సిగ్గుచేటని పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు మండిపడ్డారు. గుంటూరు నగరంలోని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరి శంకరరావు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే శంకరరావు, ఆయన తనయుడు కల్యాణ చక్రవర్తిపై టీడీపీ నేతలు లేనిపోని ఆరోపణలు చేయడం, ఎల్లో మీడియాలో కథనాలు రావడాన్ని తీవ్రంగా ఖండించారు. దండా నాగేంద్ర అరెస్టు వ్యవహారంలో ఎమ్మెల్యే నంబూరికి, వైఎస్సార్ సీపీకి ఎటువంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. దండా నాగేంద్ర, అతని బంధువుల ఆరోపణలు ఏ మాత్రం వాస్తవం కాదని తెలిపారు. దండా నాగేంద్ర టీడీపీలో తప్పుడు పనులు చేస్తే.. సస్పెండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ నేతను అని చెప్పుకుంటూ..తప్పులు చేస్తుంటే ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మందలించి దూరం పెట్టారని వివరించారు. ఆ అక్కసుతో అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారని ఆరోపించారు. ఇసుక అక్రమ వ్యాపారం, తెలంగాణ నుంచి తీసుకుని వచ్చి మద్యం విక్రయం, డ్రగ్స్ అమ్మకాలు వంటి కేసుల్లో దండా నాగేంద్ర నిందితుడిగా ఉన్న విషయాన్ని తెలిపారు. తప్పుడు వ్యక్తులకు వైఎస్సార్ సీపీలో చోటు లేదని.. అందుకే దూరం పెట్టామని స్పష్టం చేశారు. దండా నాగేంద్రకు కనీసం పార్టీలో క్రియాశీలక సభ్యత్వం కూడా లేదని తెలిపారు. ఇసుక వ్యాపారంలో లాభాల కోసం గతంలో ఎన్టీటీలో కేసులు వేసి జేపీ లాంటి కంపెనీల్ని బెదిరించే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. ఆ వ్యవహారంలో ఎమ్మెల్యే శంకరరావు, ఆయన కుటుంబ సభ్యులకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇదంతా టీడీపీ నేతల కుట్రలా కనపడుతోందని, గతంలో ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన దండా నాగేంద్రకు ఇప్పుడు చంద్రబాబు వత్తాసు పలకడం వెనక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే శంకరరావుపై ఆరోపణలు చేస్తున్న వారి ఆర్థిక పరిస్థితి 2019 ముందుకు ఎలా ఉందో.. ఇప్పుడు ఎలా మారారో ప్రజలకు తెలుసన్నారు. కేవలం ఎమ్మెల్యేకు వస్తున్న ప్రజాదరణ, మంచి పేరు చూసి ఓర్వలేక కుటిల రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పనికిమాలిన ఆరోపణలెన్ని చేసినా.. ప్రజలు నమ్మరన్న విషయాన్ని టీడీపీ నేతలు గుర్తించాలని హితవు పలికారు. సమావేశంలో క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ ఈద సాంబిరెడ్డి, సీనియర్ నాయకులు మంగిశెట్టి కోటేశ్వరరావు, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్లు మాగులూరి అనిల్ కుమార్, నాయుడు రాంబాబు, పార్టీ నేతలు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, నండూరి కరుణ్ కుమార్, ఉప్పుటూరి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు



జెడ్పీటీసీ విజయప్రతాప్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన బీసీ వడియరాజుల కుటుంబాలు

అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలేనికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు తమ్మిశెట్టి యల్లమంద సహా 10 బీసీ వడియరాజుల కుటుంబాలకు చెందిన సుమారు 30మందికి పైగా సోమవారం సాయంత్రం టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరుకుంపాలెంలో బీసీ కుటుంబాలు 250కి పైగా ఉండగా ఇప్పటికి 200మందికి పైగా వైఎస్సార్ సీపీ పక్షాన ఉన్నట్లు చెప్పారు. కరుడుకట్టిన టీడీపీ వారి సైతం సీఎం జగన్‌మోహనరెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్నట్లు తెలిపారు. తాజాగా చేరిన తమ్మిశెట్టి యల్లమంద గతంలో టీడీపీ నుంచి ఎంపీటీసీగా గెలుపొందారన్నారు. మాజీ ఉప సర్పంచ్ ఉప్పు వెంకటేశ్వర్లు కూడా గత 26 సంవత్సరాలుగా టీడీపీలో ఉండి ఏ విధమైన లబ్ధి పొందకపోవడంతో విసికి, వేసారి వైఎస్సార్ సీపీలో చేరినట్లు చెప్పారు. చెరుకుంపాలెంలో బీసీ కుటుంబాలలో చాలా భాగం వైఎస్సార్ సీపీలోకి చేరినట్లు పేర్కొన్నారు. టీడీపీ ఖాళీ కావడం ఖాయమని తెలిపారు. తాజాగా పార్టీలో చేరిన వారిలో తమ్మిశెట్టి నాగులుమీరా, తమిశెట్టి పోతురాజు, బాల బాజి, పెద్దపోతురాజు, ఓర్సు ఏడుకొండలు, వేముల వెంకటేశ్వర్లు, రాయన ముసలయ్య, రాయన రాంబాబు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రజనీకృష్ణా నాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ చింతగుంట్ల హనుమంతరెడ్డి, జిల్లా బీసీ సెల్ కన్వీనర్ సాతర్ల శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, సుంకర శ్రీనివాసరెడ్డి, గొటిక శ్రీనివాసరెడ్డి, బత్తుల శ్రీనివాసరావు, చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం




చండీ హోమం చేయిస్తున్న హనుమత్ స్వామి

సత్తెనపల్లి: పట్టణంలోని త్రిశక్తి దుర్గా పీఠంలో 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్ని పురస్కరించుకొని సోమవారం శివపార్వతుల కల్యాణాన్ని వైభోపేతంగా నిర్వహించారు. త్రిపురమల్లు రవిచంద్రకుమార్, సునీత, ఫణిదరపు నాగమల్లేశ్వరరావు, సుజాత దంపతులు కల్యాణోత్సవంలో కూర్చున్నారు. ముందుగా శ్రీ చండీహోమం, పూర్ణాహుతి, మంత్ర పుష్పం, హారతిని నిర్వహించారు. పీఠాధిపతి హనుమత్‌స్వామి చండీ హోమాన్ని జరిపించారు. త్రిపురమల్లు సునీత ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన, గాజుల పూజ నిర్వహించారు. అనంతరం పవలింపు సేవను చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఆటంకం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మిరపలో తెగుళ్లపై అప్రమత్తత అవసరం

క్రోసూరు: మిరపలో తెగుళ్లపై అప్రమత్తత అవసరమని ఉద్యాన శాఖ ఏవో సీహెచ్. జనని సూచించారు. మండలంలోని ఎర్రబాలెం, అందుకూరు గ్రామాల్లో సోమవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మిరప పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆ శాఖ అధికారి సీహెచ్. జనని రైతులకు అవగాహన కల్పించారు. సాగుకు ముందు అలసంద, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట పైర్లను వేసి రోటోవేటర్లతో నేలలో కలియదున్నాలని తెలిపారు. పూర్తిగా రసాయన ఎరువులపై ఆధార పడకుండా పోషకాలలో 25శాతం సేంద్రియ ఎరువుల రూపంలో అందించాలని సూచించారు. ఎకరానికి 10 టన్నులు పసువుల ఎరువు, 25 కిలోల వేపపిండి వేయాలని తెలిపారు. జీవన ఎరువుల్ని పశువుల ఎరువులతో వాడటం వల్ల నేల ద్వారా సంక్రమించే ఎండు తెగుళ్లు, వేరుకుళ్లు తెగులు వంటివి నివారించవచ్చని చెప్పారు. అనంతరం మిరప రైతులకు ఈ– క్రాపింగ్‌పై క్షేత్రస్థాయిలో వివరించారు. నర్సరీ మిరపనారు కొనుగోలు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహ హస్తాలు ఫౌండేషన్ సేవలు అభినందనీయం



ప్రిన్సిపాల్ ఉషారాణికి కంప్యూటర్ అందజేస్తున్న సభ్యులు

బెల్లంకొండ: స్నేహ హస్తాలు ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ టి. ఉషారాణి తెలిపారు. మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద పాఠశాలకు సోమవారం సంస్థ ద్వారా రూ.15వేల విలువ గల కంప్యూటర్, ఇంటర్మీడియెట్ విద్యార్థులు 80 మందికి 400 నోట్‌బుక్స్, 30 మొక్కల్ని సంస్థ సభ్యుడు కూరపాటి మధు అందజేశారు. సంస్థ ద్వారా విద్యార్థులకు వస్తువులు, ఉన్నత చదువులు చదివే వారికి హాస్టల్ ఫీజులు, ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపుపై విచారణ



మాదలలో ఫారం-7 తొలగింపులను తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి ఆంజనేయులు

ముప్పాళ్ల: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని నాలుగు గ్రామాల్లో ఫారం-7 తొలగింపులపై నియోజకవర్గ ప్రత్యేకాధికారి సీహెచ్.ఆంజనేయులు సోమవారం తనిఖీ చేశారు. మండలంలోని మాదల, గోళ్లపాడు, లంకెలకూరపాడు, ఇరుకుపాలెం గ్రామాల్లో తొలగింపుల జాబితాల్ని ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేశారు. గతంలో జరిగిన ఓటర్ల సర్వే ప్రక్రియలో ఎటువంటి లోపాలు లేవని గుర్తించారు. కార్యక్రమంలో గ్రామ బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగురాళ్ల ఎస్ఐగా కోటయ్య

పిడుగురాళ్ల: పట్టణ ఎస్ఐగా కోటయ్య సోమవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఆయన మాచవరం మండలంలో విధులు నిర్వహించి, బదిలీపై పిడుగురాళ్లకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల్ని కాపాడేందుకు కృషి చేస్తానని చెప్పారు.

9న లోక్ అదాలత్

పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 9న లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎం.మురళీ గంగాధరరావు తెలియజేశారు. కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకొని కేసుల నుంచి బయటపడాలని సూచించారు. తద్వారా కక్షిదారులు కాలాన్ని, డబ్బుని ఆదా చేసుకోవచ్చన్నారు. కేసుల పరిష్కారానికి ఈ జాతీయ లోక్ అదాలత్ ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులు, మనోవర్తి, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించబడతాయని తెలియజేశారు.

సచివాలయ వ్యవస్థ పనితీరు ఆదర్శనీయం



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

నకరికల్లు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ పనితీరు ఆదర్శనీయంగా ఉందని ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. శిక్షణలో భాగంగా సోమవారం నకరికల్లులో పర్యటించారు. స్థానిక సచివాలయాన్ని సందర్శించి విభాగాల వారీగా సిబ్బంది విధుల్ని పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించేందుకు పలు వార్డుల్లో పర్యటించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణ, సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలపై ప్రజల నుంచి అర్జీల్ని స్వీకరించారు. ఎస్సీ కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉందన్న పిర్యాదు మేరకు సత్వరమే పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ పథకాల నిర్వహణ, అధికారుల పనితీరు, ప్రజలతో మమేకమవుతున్న తీరు చక్కగా ఉందని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి భావన్నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజా ప్రతినిధుల్ని భాగస్వాముల్ని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి

రాజుపాలెం: గ్రామాల్లో అధికారులు చేపట్టే అభివృద్ధి పనుల్లో ప్రజా ప్రతినిధుల్ని భాగస్వాముల్ని చేయాలని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని ఆ శాఖ అధికారుల్ని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా జరిగే విధంగా సూపర్‌వైజర్లు చర్యలు చేపట్టాలని సూచించారు. ముందుగా అధికారులు వారి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, తహసీల్దారు ఏ.బేగం, ఎంఈవో మల్లికార్జునశర్మ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ రమాదేవి తదితరులు

సత్తెనపల్లి: పోషకాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు, పోషక విలువలతో కూడిన ఆహారం ఎంతో అవసరమని ఆమె సూచించారు. మండలంలోని నంది గామ అంగన్‌వాడీ సెంటర్‌లో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలు, కాయగూరల విత్తనాల పంపిణీ కార్యక్రమంలో సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

పోషకాహార లోపం వల్ల పిల్లల్లో వ్యాధినిరోధకశక్తి తగ్గి అనారోగ్యానికి గురవుతారన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ గర్భిణి శరీరంలో పిండం ఏర్పడడానికి, సులువైన ప్రసవం జరగడానికి, ఆరోగ్యమైన శిశువు జననానికి పౌష్టికాహారం ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. అది ఎక్కువగా ఆకుకూరలు, కాయగూరల్లో లభిస్తుందని సూచించారు. అనంతరం పాలకూర, మెంతికూర, గోంగూర, బీరలు, ములగ, దోసలు, కాకరకాయ, బెండ విత్తనాల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సురేష్, శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, వాణి, మేరీ పాల్గొన్నారు.

కోదండ రామాలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు

తొండపి(ముప్పాళ్ల): మండలంలోని తొండపిలో బీసీల ఆధ్వర్యంలో నిర్మించనున్న కోదండ రామాలయం నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పాల్గొన్నారు. ముందుగా గ్రామస్థులు అతిథులకు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. ఆలయ నిర్మాణం త్వరితగత పూర్తికావాలని వారు ఆకాక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పక్కాల సూరిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తం, కళ్లం విజయభాస్కరరెడ్డి, ఎం.జె.ఎం.రామలింగారెడ్డి, సచివాలయల జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, శిరిగిరి గోపాలరావు, నక్కా శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నాగూల్ మీరా, జానీ భాష, బోరుపోతు కాటయ్య, బ్రహ్మయ్య, బాబూరావు, చిన్నబ్బాయి, భూపతి, రాములమ్మ పాల్గొన్నారు.